క్లుప్తంగా

తహసీల్దార్ల బదిలీ

మామిడికుదురు/అయినవిల్లి: మామిడికుదురు మండల తహసీల్దార్‌గా రియాజ్ హుస్సేన్, అయినవిల్లి తహసీల్దార్‌గా నాగలక్ష్మమ్మ బాధ్యతలు స్వీకరించారు. అయినవిల్లి నుంచి మామిడికుదురుకు రియాజ్ హుస్సేన్, మామిడికుదురు నుంచి అయినవిల్లి తహసీల్దార్‌గా నాగలక్ష్మమ్మ బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన వీరిరువురికీ వీఆర్వోలు, రెవెన్యూ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలసి వారికి అభినందనలు తెలిపారు.

పాళ్లమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

మామిడికుదురు: ఈదరాడ గ్రామ దేవత పాళ్లమ్మ నూతన ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన జరిగింది. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ యెరుబండి నాగేంద్రవరప్రసాద్–అనంతలక్ష్మి దంపతులు కొత్త గుడి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొత్తపేట మండలం వాడపల్రుకు చెందిన సుదర్శనం వెంకటజనార్దనాచార్యుల బ్రహ్మత్వంలో ఈ కార్యక్రమం ఆద్యంతం ఘనంగా జరిపించారు. సుమారు దశాబ్దానికి పూర్వం నిర్మించిన పాళ్లమ్మ ఆలయం శిథిలస్థితికి చేరుకోవడంతో దాన్ని సమూలంగా తొలగించి దాని స్థానే నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ యెరుబండి శ్రీరామ్మూర్తితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలి

పి.గన్నవరం: అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రతిపాదించిన విధంగా పి.గన్నవరం సీహెచ్‌సీలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ బుధవారం జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం తీర్మానించింది. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ జీవీ సురేష్ అధ్యక్షతన జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చిట్టిబాబు మాట్లాడుతూ ఆస్పత్రికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేసేందుకు కృషి చేస్తామన్నారు. సీఎం జగన్ వైద్య రంగానికి పెద్ద పీట వేస్తున్నారని, ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. సమావేశంలో డాక్టర్ అన్నాజీరావు, పంచాయతీ కార్యదర్శి కె.పోలరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా ప్రజలకు మంచి సేవ చేయాలి

మామిడికుదురు: ఈఓపీఆర్డీగా పని చేస్తూ ఎంపీడీఓగా పదోన్నతి పొందిన గరగ శివరామకృష్ణయ్యను బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. కాకినాడ జిల్లా శంఖవరం ఎంపీడీఓగా కృష్ణయ్య ఉత్తమ సేవలందించి ప్రజల మన్ననలు అందుకోవాలని జెడ్పీటీసీ కొరెడ్డి ఆంజనేయులు అభిలాషించారు. ఈఓపీఆర్డీగా శివరామకృష్ణయ్య ఉత్తమ సేవలందించారని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శివరామకృష్ణయ్యకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువలతో సత్కరించి, నూతన వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై చైతన్యం తీసుకువస్తాం

మామిడికుదురు: ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే దిశగా కార్యాచరణ చేపట్టామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు తెలిపారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ అధ్యక్షతన బుధవారం మామిడికుదురులో జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు అయినవిల్లి మండలం ముక్తేశ్వరంలో జరిగే సమావేశంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురంధేశ్వరి పాల్గొంటారని చెప్పారు.సమావేశంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాలు

రాజోలు: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల్లోను రాయితీపై వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నట్టు ఏవో వై.మధుకుమార్ బుధవారం తెలిపారు. కేజీ విత్తనం ఒక్కంటికి రూ.5 చొప్పున సబ్సిడీపై వీటిని అందుబాటులో ఉంచినట్టు ఆయన చెప్పారు. సార్వా సీజన్ ప్రారంభం కానున్న తరుణంలో విత్తనాల కోసం దగ్గర్లోని ఆర్బీకేలో రైతులు సంప్రదించాలని సూచించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మలికిపురం: మండలంలోని దిండి గ్రామంలోని వశిష్ట నదీ తీరంలో బుధవారం గుర్తు తెలియని పురుషుని మృతదేహం లభించింది. వయస్సు 30 సంవత్సరాలు ఉంటుందని ఎస్సై జి.సురేంద్ర తెలిపారు. గ్రామ వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాసుపత్రికి పంపినట్లు ఆయన వివరించారు.

ప్రీ స్కూల్‌పై అవగాహన ర్యాలీ

రావులపాలెం: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో జన భాగిదారీ కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రీస్కూల్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని 10 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న సిబ్బంది ఈ ర్యాలీలో పాల్గొని మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లల్ని పాఠశాలల్లో జాయిన్ చేయాలని తల్లిదండ్రులకు అవగాహన కలిగించారు. అలాగే ప్రీస్కూల్ ఆవశ్యకతపై సీడీపీఓ శారద, ఆశ వర్కర్లు వివరించారు.

ఆణిముత్యాలకు ఆర్థిక ప్రోత్సాహం

- ఉత్తమ ఫలితాలు సాధించిన పది, ఇంటర్ విద్యార్థులకు పురస్కారాలు
- విద్యలో నాణ్యత, పోటీతత్వం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం
- నేడు పాఠశాల, నియోజకవర్గ స్థాయిలో టాపర్లకు సత్కారం



ఉత్తమ విద్యార్థులకు ప్రదానం చేసే సర్టిఫికెట్స్, మెడల్స్, శాలువాలు

పాఠశాల స్థాయిలో ఉత్తమ విద్యార్థులు

నియోజకవర్గం	పాఠశాలలు	గోల్డ్	సిల్వర్	బ్రాంజ్
కొత్తపేట	35	41	38	36
పి.గన్నవరం	45	47	46	48
రాజోలు	33	33	35	35
మొత్తం	113	121	119	119

కొత్తపేట: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివేది పేద, మధ్యతరగతి విద్యార్థులే. వారిలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే కనీవినీ ఎరుగని బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకుని తుది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు' (స్టేట్ బ్రిలియంట్ అవార్డ్స్) పేరిట నగదు పురస్కారాలతో సత్కరించనున్నారు. ఆ మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి, ఇంటర్మీడియెట్ కళాశాలల్లో ఉత్తమ విద్యార్థులను ఎంపిక చేశారు. ఆ మేరకు నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ విద్యార్థులను గురువారం ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల చేతుల మీదుగా సత్కరించనున్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు

రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచీ విద్యారంగంలో పలు మార్పులు తీసుకువచ్చింది. విప్లవాత్మక సంస్కరణలు అమలు చేస్తుంది. దానిలో భాగంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను 'నాడు–నేడు' పేరుతో అభివృద్ధి చేసింది. విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించింది. ఏటా జగనన్న విద్యాకానుక అందిస్తుంది. 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు ఇచ్చింది. విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా ప్రత్యేక మెనూతో మధ్యాహ్న భోజనం అందిస్తుంది. విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు రాగిజావ అందిస్తుంది. తాజాగా విద్యలో నాణ్యత, విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించేందుకు, తద్వారా వారిలో ప్రతిభను ప్రోత్సహించేందుకు 'జగనన్న ఆణిముత్యాలు' పేరుతో మరో వినూత్న కార్యక్రమం అమలు చేస్తుంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభను చాటి ఉత్తమ ఫలితాలు సాధించి మొదటి మూడు స్థానాలు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులను, మార్చిలో జరిగిన ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ/ఎంఈసీ గ్రూపుల వారీగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఈ అవార్డులకు ఎంపిక చేసి 'జగనన్న ఆణిముత్యాలు' అవార్డులతో ప్రభుత్వం సత్కరించనుంది. మొదట పదో తరగతి విద్యార్థులను నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో మెరిట్ విద్యార్థులను సత్కరించాలని ప్రభుత్వం భావించింది. ఈ కార్యక్రమం గత నెలలోనే జరగాల్సి ఉన్నా అనివార్య కారణాల వలన వాయిదా పడింది. ఇప్పుడు కొత్తగా పై మూడు స్థాయిల్లోనే కాకుండా ప్రతి ఉన్నత పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను కూడా సత్కరించాలని సీఎం జగన్ నిర్ణయించారు. వారిలో ప్రథమ స్థానం విద్యార్థికి రూ.3 వేల నగదు, గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్, ద్వితీయ స్థానం విద్యార్థికి రూ.2 వేల నగదు, సిల్వర్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్, తృతీయ స్థానం విద్యార్థికి రూ.వెయ్యి నగదు, బ్రాంజ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్ అందించనుంది. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.15 వేల నగదు, గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్, ద్వితీయ స్థానం విద్యార్థికి రూ.10 వేల నగదు, సిల్వర్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్, తృతీయ స్థానం విద్యార్థికి రూ.5 వేల నగదు, కాంస్య పతకం, మెరిట్ సర్టిఫికెట్ అందించనుంది. ఆ సంబంధిత విద్యా సంస్థలకు మెమెంటో, హెచ్ఎంలను, పేరెంట్స్‌ను కూడా సత్కరించనుంది.

మార్కుల ఆధారంగా పదో తరగతిలో కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో నియోజకవర్గ స్థాయిలో 10 పాఠశాలల నుంచి 15 మంది విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ఇంటర్మీడియెట్‌కు సంబంధించి ఆరు కళాశాల నుంచి 13 మంది విద్యార్థులు నాలుగు గ్రూపుల వారీగా టాప్–1 ర్యాంక్‌లు సాధించారు.

ప్రోత్సాహం శుభపరిణామం



ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ఆణిముత్యాలు పేరుతో ప్రోత్సహించడం గొప్ప శుభపరిణామం. ఈ ప్రోత్సాహం వలన విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుంది. పాఠశాల, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో తామూ ప్రథమ ర్యాంకులు సాధించాలని విద్యార్థుల్లో తపన, పట్టుదల పెరుగుతుంది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల విద్యార్థులతో పోటీ పడి చదువుతారు. ఎక్కువమంది ఉన్నత స్థానాలు అధిరోహించే అవకాశం కలుగుతుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ విధానంతో భవిష్యత్‌లో ప్రభుత్వ పాఠశాలలు కూడా మంచి ఫలితాలు సాధిస్తాయి.

– మట్టపర్తి హరిప్రసాద్, ఎంఈఓ, కొత్తపేట/రావులపాలెం

అప్పనపల్లి దేవస్థానం ఏసీగా మాధవి



మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్, ఈవోగా జి.మాధవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గుంటూరు జిల్లా వైకుంఠపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి బదిలీపై అప్పనపల్లి వచ్చారు. ఇక్కడ ఏసీగా పని చేసిన డి.సాయిబాబు గుంటూరు జిల్లా పెదకాకాని ఎండోమెంట్స్ ట్రిబ్యునల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా బదిలీ అయ్యారు. ఏసీ, ఈఓగా బాధ్యతలు చేపట్టిన మాధవికి ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా వేద మంత్రాలతో స్వాగతం పలికారు. స్వామి వారి ఆశీస్సులు అందించారు. ఏసీ మాధవిని ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి ఆమెను అభినందించారు.

వినియోగదారులను ఆదుకోవాలి

మలికిపురం: రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం పడుతుందని పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు పేర్కొన్నారు. బుధవారం ఆయన మలికిపురంలో విలేకరులతో మాట్లాడుతూ వివిధ రకాల చార్జీలతో విద్యుత్ బిల్లులు దారుణంగా పెరిగాయన్నారు. అదనపు వసూళ్లను వెంటనే ఆపి గృహ వినియోగదారులు, రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



లూటుకుర్రు స్కూల్‌లో ఎమ్మెల్యే చిట్టిబాబు సమక్షంలో జగన్ చిత్రపటానికి విద్యార్థుల క్షీరాభిషేకం

మామిడికుదురు: లూటుకుర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బుధవారం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, జెడ్పీటీసీ కశిరెడ్డి ఆంజనేయులు సమక్షంలో 'థ్యాంక్యూ సీఎం సారూ', 'థ్యాంక్యూ జగన్ మావయ్య' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మిండగుదుటి శిరీష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం లూటుకుర్రులో జరిగింది. ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.నాగప్రసాద్, మండల జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, పార్టీ నేతలు జిల్లెళ్ల రమేష్, దేవరపల్లి రవీంద్రన్, శ్రీరెడ్డి సుబ్బారావు, మేడిశెట్టి రాజా, చింతా రామకృష్ణ, యూవీవీ సత్యనారాయణ, తులా గోపాలకృష్ణ, పెదపూడి శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

మామిడికుదురు: తాగునీటి సమస్యతో పాటు లో–ఓల్టేజ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాటిని పరిష్కరించాలని కోరుతూ బాడిలంక వాసులు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు వినతిపత్రం ఇచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం లూటుకుర్రులో జరిగింది. దీనిలో భాగంగా బాడిలంకలో ఎమ్మెల్యే చిట్టిబాబు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, లో–ఓల్టేజ్ సమస్య తమను తీవ్రంగా వేధిస్తోందని స్థానికులు వాపోయారు. దీనిపై ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ లో–ఓల్టేజ్ సమస్యపై సంబంధిత అధికారులతో మాట్లాడానన్నారు. దీనిని వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. తాగునీటి సమస్యను కూడా పరిష్కరించే దిశగా కార్యాచరణ చేపట్టామని చెప్పారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, గ్రామశాఖ అధ్యక్షుడు అడబాల చక్రపాణి, పార్టీ నేతలు చింతా రామకృష్ణ, యూవీవీ సత్యనారాయణ, తులా గోపాలకృష్ణ, పెదపూడి శ్రీను, గుబ్బింక సత్యనారాయణ, కడలి శేఖర్, ఇంజేటి జాన్, విప్పర్తి రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు



మలికిపురంలో జేవీకే కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: రాష్ట్ర విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌దేనని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. మండల విద్యా శాఖ కార్యాలయంలో జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. ఎంఈఓ ఎం.విజయశ్రీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ చదువుతోనే విద్యార్థుల భవిష్యత్ ముడిపడి ఉందని ద్వారా గ్రామ, దేశ భవిష్యత్ ఉన్నతంగా ఉంటుందని నమ్మిన ఏకైక వ్యక్తి సీఎం జగన్ అని అన్నారు. అందుకోసమే విద్య కోసం అధిక నిధులు వెచ్చించి పాఠశాలలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం అందిస్తున్న విద్యాకానుక కిట్‌లో ఇంగ్లీషు, తెలుగు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, మూడు జతల యూనిఫామ్స్, బూట్లు తదతర వస్తువులు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, ఎంపీడీఓ ముత్యం వీరాస్వామినాయుడు, గెడ్డం తులసీ భాస్కరరావు, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మీ మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల వివరాలతో బోర్డులు పెట్టాలి



ఎంపీపీ కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లతో ఎంపీపీ, ఎంఈవో

అంబాజీపేట: ప్రైవేట్ స్కూళ్లలో విద్యార్థుల ఫీజులు, తరగతి గదులు, అమ్మఒడి పథకం, తదితర వివరాలను అందరికీ కనిపించేటట్లుగా డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలని ఎంఈఓ జేవీఎస్ కనకదుర్గ అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ప్రైవేట్ స్కూళ్లలో యాజమాన్యంతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పాఠ్యపుస్తకాలను మాత్రమే విద్యార్థులకు బోధించాలన్నారు ప్రభుత్వ సెలవులను ప్రైవేటు స్కూలు యాజమాన్యం కూడా పాటించాలన్నారు. ముఖ్యంగా అమ్మఒడి పథకం ఎంత మంది విద్యార్థులకు వర్తించిందో డిస్‌ప్లే బోర్డులో నమోదు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడిపే పాఠశాలలపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ప్రైవేటు పాఠశాల యాజమాన్యాల సీఆర్పీలు పాల్గొన్నారు

ఆక్రమణలు తొలగించాలి

పి.గన్నవరం: ఆర్బీ రోడ్డులో జి.పెదపూడి నుంచి చాకలిపాలెం సెంటర్ వరకూ ఉన్న ఆక్రమణలను వారం రోజుల్లో తొలగించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు బుధవారం జరిగిన మండల సమావేశంలో అధికారులను ఆదేశించారు. ఎంపీపీ అంబటి భూలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈరోడ్డులో రోజురోజుకీ ఆక్రమణలు పెరిపోవడంతో, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఎప్పటికప్పుడు ఆక్రమణలు తొలగిస్తే, ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. ఆక్రమణల విషయంలో అధికారుల మెతకవైఖరి ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు చెప్పినా వినొద్దని, తక్షణమే ఆక్రమలు తొలగించాలని చిట్టిబాబు అన్నారు. గ్రామాల్లోని వివిధ సమస్యలపై సభ్యులు సమావేశంలో చర్చించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నక్కా కృష్ణవేణి, తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంఈఓ కోన హెలీనా, ఎస్సై హరికోటిశాస్త్రి, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీపీ అంబటి భూలక్ష్మి జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే చిట్టిబాబు పాల్గొని కేకు కట్ చేసి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

దిశ యాప్‌పై స్పెషల్ డ్రైవ్

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లి, ముక్తేశ్వరంలో దిశయాప్‌పై బుధవారం అయినవిల్లి పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. గ్రామ మహిళా సంరక్షణ అధికారుల ఆధ్వర్యంలో ఈ దిశయాప్‌పై పలువురు మహిళలకు అవగాహన కల్పించారు. మహిళల ఆండ్రాయిడ్ ఫోన్లో దిశయాప్ డౌన్‌లోడ్, యాప్ ఉపయోగాన్ని వివరించారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: దిశ యాప్‌ను ప్రతి ఒక్కరూ విధిగా డౌన్లోడ్ చేసుకోవాలని పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్ సూచించారు. పాశర్లపూడి బాడవ వైనతేయ వారధి వద్ద బుధవారం దిశ యాప్‌పై ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. నగరం ఎస్సై షేక్ జానీ బాషా ఆధ్వర్యంలో పలుచోట్ల ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నగరం పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్స్, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: మొబైల్ ఫోన్లలో దిశ యాప్ వేసుకోవడం వల్ల మహిళలకు భద్రత ఉంటుందని ఎస్సై ఎ.చైతన్యకుమార్ అన్నారు. అంబాజీపేట మండలంలోని ప్రధాన కూడళ్లలో దిశ యాప్ వలన మహిళలకు వచ్చే ఉపయోగాలను అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆపత్కాలంలో దిశ యాప్ ను ఉపయోగిస్తే క్షణాల్లో వారు ఏ ప్రాంతంలో ఉన్న రక్షిస్తామని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్లను అడ్డుకున్న స్థానికులు

మామిడికుదురు: పాశర్లపూడిలంకలో ఇసుక టిప్పర్లను స్థానికులు బుధవారం అడ్డుకున్నారు. ఓఎన్జీసీ గ్రౌండ్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను నిల్వ చేస్తున్నారని స్థానిక సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, తెలగారెడ్డి బులినాగేశ్వరరావు, యల్లమిల్లి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. ఇసుక టిప్పర్ల రాకపోకలతో రోడ్డు పాడైపోతున్నాయని వాపోయారు. ఇక్కడ జరుగుతున్న వివాదం నేపథ్యంలో నగరం ఎస్సై షేక్ జానీబాషా అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆదుర్రులో నిల్వ చేయాల్సిన ఇసుకను పాశర్లపూడిలంక ఎందుకు తరలించారంటూ టిప్పర్ల డ్రైవర్లను ప్రశ్నించారు. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో పాటు ఇసుకను తరలిస్తున్న టిప్పర్లపై ఉన్న నంబర్లకు అనుమతి పత్రాల్లో ఉన్న నంబర్లకు తేడాలు ఉండడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం 15 టిప్పర్ల ఇసుకను సీజ్ చేశామనిఎస్సై చెప్పారు. రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకుని వీఆర్వో రాయుడుకు అప్పగించారు.

ఇది జవాబుదారీ ప్రభుత్వం

మలికిపురం: ప్రజలకు జవాబుదారీగా సీఎం జగన్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు అన్నారు. మండలంలోని కేశనపల్లిలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా తెలియ జేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అమలు చేస్తుందని అవి ప్రజలకు ఏ విధంగా ఉపయోగ పడుతున్నాయో ఫీడ్ బ్యాక్ కూడా తీసుకోవాలని సూచించారు. పార్టీ అధిష్ఠానం కార్యకర్తలపై ఉంచిన బృహత్తర బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తే రాబోయే ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయన్నారు. సొసైటీ చైర్మన్ యెనుముల నారాయణ స్వామి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు సుంకర బాబ్జి, యర్రంశెట్టి కృష్ణ, అడబాల కృష్ణారావు, రంగ, గుండుమేను శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం బాటిళ్ల ధ్వంసం

ఆలమూరు: స్థానిక ఎస్ఈబీ స్టేషన్ ఆవరణలో బుధవారం అక్రమ మద్యం బాటిళ్ల ధ్వంసం జరిగింది. రాష్ట్ర ఎస్ఈబీ డిప్యూటీ కమిషనరేట్ ఆదేశాల మేరకు అమలాపురం అదనపు ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా స్థానిక పోలీసు స్టేషన్‌కు సమక్షంలో సీఐ అరుణమ్మ, ఎస్సై రాంబాబు తదితరులు 563 మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. అందులో 512 బాటిళ్లు నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ కాగా 52 బాటిళ్లు పెయిడ్ లిక్కర్‌కు సంబంధించినట్లు సీఐ పేర్కొన్నారు. అలాగే 164 సారాను కూడా ధ్వంసం చేశామన్నారు. అక్రమంగా సారా తయారు చేసినా, విక్రయించినా, అక్రమ మద్యాన్ని తరలిస్తున్న కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



పి.గన్నవరంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా పి.గన్నవరం సీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరాన్ని చిట్టిబాబు ప్రారంభించారు. వైద్య సిబ్బందితో పాటు 17 మంది రక్త దానం చేయగా, వారిని చిట్టిబాబు అభినందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెంట్ జీవీ సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, కొక్కిరి రవికుమార్, దొమ్మేటి దుర్గారావు, నూకపెయ్యి రాజేంద్రప్రసాద్, డాక్టర్ అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకుని విరివిగా రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని వైద్యుడు రాపాక రమేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం మలికిపురం ఎంవీఎన్ జేఎస్అండ్ఆర్వీఆర్ ప్రభుత్వం ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వింగ్ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థుల అవగాహన సదస్సులో రమేష్‌బాబు మాట్లాడారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా రక్తదానం చేసేవారి సంఖ్య నానాటికీ తగ్గి పోతుందని ఇది ప్రమాద ఘంటిక అని అన్నారు. దీనిపై గ్రామాల్లో మరింత అవగాహన పెంచాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ తోరం సతీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు రమేష్‌బాబు, విజయకుమార్, డి.శ్రీనివాస్, సీహెచ్ సత్యనారాయణ, పి.సూర్యనారాయణ, నిశ్చలాదేవి, శర్మ, శివాజీ, వలంటీర్లు పాల్గొన్నారు.

కొత్తపేట: రక్తదానం ప్రాణదానంతో సమానమని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అరుణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ స్వచ్ఛంద రక్త దాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రాణదాతలుగా తయారుచేసేందుకు రక్తదానంపై పాఠశాల స్థాయి నుంచి కళాశాల, యూనివర్సిటీ స్థాయిలో ప్రత్యేక సిలబస్ రూపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రక్తదానంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

తాగునీటి ప్రాజెక్ట్ పనుల పరిశీలన



అంతర్వేది దేవస్థానంలో తాగునీటి ప్రాజెక్ట్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో జల్‌జీవన్ మిషన్‌లో నూతనంగా చేపట్టిన తాగునీటి ప్రాజెక్ట్ పనులను బుధవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పరిశీలించారు. చెరువుకు రక్షణగా నిర్మిస్తున్న గోడ కాంక్రీట్ పనులను ఆయన పర్యవేక్షించారు. తీర ప్రాంత గ్రామాల్లో ప్రజల దాహార్తికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.17.33 కోట్ల ప్రాజెక్ట్‌కు ఎమ్మెల్యే ఇటీవల శంకుస్థాపన చేశారు. ఈ మేరకు దేవస్థానం గ్రామంలోని 12 ఎకరాల మంచినీటి చెరువును బృహత్తర తాగునీటి సరఫరా ప్రాజెక్ట్‌గా అధికారుల రూపకల్పన చేస్తున్నారు. సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ బైర నాగరాజు, వీఆర్వో ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

ముందస్తు సాగుకు రైతులను ప్రోత్సహించాలి

అంబాజీపేట: ఖరీఫ్‌లో ముందస్తు సాగుకు రైతులను ప్రోత్సహించి సాగు చేసేలా చూడాలని పి. గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో వీఏఏ, వీహెచ్ఏలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ఈనెలాఖరుకి వరి నాట్లు పూర్తి చేసుకునేలా రైతులను సిద్ధం చేయాలన్నారు. ఈ–కేవైసీ నమోదు కాని రైతులు తక్షణమే నమోదు చేయించుకోవాలన్నారు. గ్రామాల్లోని ఆర్బీకేల్లో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు సీహెచ్‌డీ విజయకుమార్, డి.దుర్గారావు పాల్గొన్నారు.